# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 120 ఫిర్యాదులు

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 120 ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

బాన్సువాడలో సిబ్బందికి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, సెప్టెంబర్ 23 : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మిషన్ భగీరథ పథకంలో సిబ్బంది తాగునీటి విషయంలో శ్రద్ధ వహించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. పట్టణంలోని డివిజన్ మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామ తాగునీటి సహాయకులు, సిబ్బందికి నల్ జల్ మిత్రు అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి పైపులైన్‌లో లీకేజీలు ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేలా సహాయకులు, పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్లంబింగ్, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటర్ల ప్యానల్ బాక్సులు, చేతిపంపుల మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ స్వప్న, డీఈఈ వెంకటేశ్వర్‌గౌడ్, ఇంట్రా ఏఈ శ్రీకాంత్, మిషన్ భగీరథ కార్యాలయ సిబ్బంది, గ్రామస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

**ఇసుక క్వారీ పరిశీలన**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 23 : బీర్కూర్ మండలం చించోలి గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇసుక క్వారీలను సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం పరిశీలించారు. ఇటీవల బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కిష్టాపూర్,చించొల్లి గ్రామస్తులు ఇండ్ల నిర్మాణం కోసం ఇసుక రవాణ అనుమతులను ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ విషయమై కలెక్టర్‌తో చర్చించాక అనుమతుల ఇవ్వాలా లేదా అని పరిశీలిస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ లత, ఎంపీఎస్‌వో రమణ, మాజీ సర్పంచ్ బాబూరావు ఉన్నారు.

## ట్రాన్స్‌కో అధికారుల పొలంబాట

బాన్సువాడ, సెప్టెంబర్ 23 : బాన్సువాడ పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాన్స్‌కో ఏఈ నాందేవ్ రైతులకు విద్యుత్ ప్రమాదాలపై వివరించారు. ప్రతి రైతు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మోటర్‌కు ఆటో స్టార్టర్లు తొలగించాలని, కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలను ముట్టరాదని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు సమస్య ఏర్పడినప్పుడు విద్యుత్ లైన్‌మన్, సిబ్బందికి తెలియజేయాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకట్రావ్, సాయిలు, దత్తు, శివ, విద్యుత్ సిబ్బంది అశోక్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో పంటపొలాల వద్ద రైతులతో ట్రాన్స్‌కో అధికారులు

## ఈ నెల 26 జాబ్‌మేళా

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 26న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని రూం నంబర్ 121 లో ఉన్న జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ప్రముఖ భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్ లిమిటెడ్‌లో పలు పోస్టులకు జాబ్‌మేళా నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, బీటెక్, ఎంబీఏ అర్హత ఉండాలని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7671974009, 8121018260 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

కామారెడ్డి,సెప్టెంబర్ 23 : ఒక వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి కోర్టు మూడేండ్ల జైలు శిక్ష, రూ.2.10 లక్షల జరిమానా విధించినట్లు ఎస్సై సింధూ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బాక మండలం మల్లయ్య పల్లి గ్రామానికి చెందిన బెల్లి రామయ్య తన కూతురు సురేఖను మాచారెడ్డి మండలం ఫరీద్‌పేటకు చెందిన సంటోళ్ల బాలయ్యకు ఇచ్చి పెండ్లిచేశాడు. కూతురు వాళ్ల మరిది సంటోళ్ల బాలరాజుతో ఇంటిముందున్న గుడిసె విషయంలో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పెద్దమనుషులతో పంచాయితీ పెట్టగా అక్కడికి వెళ్లిన రామయ్యపై బాలరాజు దాడిచేసి ఛాతిపై గట్టిగా కొట్టాడు. దీంతో రామయ్యను వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా మృతిచెందినట్లు తెలిపాడు. మృతుడి కూతురు సంటోళ్ల సురేఖ ఫిర్యాదు మేరకు మాచారెడ్డి పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులను విచారించి బాలరాజును అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించి, నేరం రుజువుకావడంతో న్యాయస్థానం ముద్దాయి బాలరాజుకు మూడేండ్ల జైలుశిక్ష, రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.

## బస్సులు ఆపాలని డీఎంకు వినతి

రాజంపేట, సెప్టెంబర్ 23 : మండల కేంద్రంలోని న్యూ బీసీ కాలనీ ఎల్లమ్మ ఆలయం వద్ద కామారెడ్డి నుంచి గుండారం వైపు వెళ్లే బస్సులు ఆపాలని మండల కేంద్రానికి చెందిన న్యూ బీసీ కాలనీ ప్రజలు కోరారు. కామారెడ్డి డిపో మేనేజరుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందిస్తూ బస్సులు ఆపేలా చూస్తామని హామీ ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు.

## జీవితాలను నాశనం చేసుకోవద్దు

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ రమేశ్ చైతన్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.. మాదక ద్రవ్య రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : జిల్లాలోని మాచారెడ్డిలో ఉన్న ఎస్‌కేడీజీ పాఠశాల, నాగిరెడ్డిపేట్ మండలంలో ఉన్న కేరళ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్డులో నడుపుతున్నారని, ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేకుల షెడ్డులో పాఠశాలలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు వేడికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు మణికంఠ, బీవీఎం నాయకుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం స్నేహితుడితో కలిసి వేధింపులు

- భార్య ఆత్మహత్య
- భర్తతోపాటు స్నేహితుడు అరెస్టు

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : అదనపు కట్నం కోసం స్నేహితుడితో కలిసి భర్త వేధించడంతో భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె మృతికి కారణమైన భర్తతోపాటు స్నేహితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రంగా రాణికి తొమ్మిదేండ్ల క్రితం రాజంపేట గ్రామానికి చెందిన రంగా గంగాధర్‌గౌడ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. అదనపు కట్నం కోసం గంగాధర్‌గౌడ్ తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. భర్తతోపాటు వైజాగ్ నుంచి వచ్చిన అతడి స్నేహితుడు సతీశ్ కూడా వేధిస్తూ చేయిచేసుకునేవాడు. ఈ నెల 6న ఇంటికి వచ్చిన తన తండ్రి రాజేశ్వర్‌గౌడ్‌కు రాణి తన బాధను చెప్పింది. అదేరోజు పొలాల్లో పురుగుల మందు కలుపుకొని తాగగా.. చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా..చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. రాణి తండ్రి ఫిర్యాదు మేరకు భర్తతోపాటు అతడి స్నేహితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

## ఒకరి అదృశ్యం

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మహ్మద్ బహదూర్ ఖాన్ (50) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన డ్రైవింగ్ పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. భార్య నూర్జహాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 23 : ఈ నెల 28వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో న్యాయవాదులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ప్రణాళికతో సివిల్, క్రిమినల్ తదితర కేసులను జాతీయ అదాలత్‌లో పరిష్కరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌గోపాల్‌గౌడ్, సీనియర్ న్యాయవాది జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ, సెప్టెంబర్ 23 : దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో దివ్యాంగుల హక్కుల సాధనే లక్ష్యంగా సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రతి ఒక్క దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలన్నారు. గౌరవ అధ్యక్షుడు గొడ్డు కిష్టయ్య, ఉపాధ్యక్షుడు రాములు, కార్యదర్శి గంగాధర్ యాదవ్, బిచ్కుంద సాయిలు, సంగప్ప, పల్లికొండ హన్మాండ్లు, రాజేశ్వరి, పోచయ్య, కవిత, విజయ, సావిత్రి, రాజేశ్వరి, లింగమప్ప, దివ్యాంగులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్‌కు సన్మానం

బాన్సువాడ, సెప్టెంబర్ 23 : బాన్సువాడ టీఎస్ ఆర్టీసీ సూపరింటెండెంట్‌గా కామారెడ్డి నుంచి బాన్సువాడకు బదిలీపై వచ్చిన బసంత్‌ను ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు శాలువాతో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గిరిధర్, హన్మంత్, కృష్ణ, హుస్సేన్, సాగర్ తదితరులు ఉన్నారు.

## రేపు మినీ స్టేడియంలో ఖోఖో క్రీడాకారుల ఎంపిక

బాన్సువాడ, సెప్టెంబర్ 23 : పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఈ నెల 25న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు స్టేడియం మేనేజర్ పంతులు నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో పోటీల్లో (అండర్-14, 17) బాలబాలికల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మూడు మండలాల ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల క్రీడాకారుల ఎంపిక ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు జోనల్ క్రీడా పోటీల ఇన్‌చార్జి ప్రేమ్ (పీడీ)కు రిపోర్టు చేయాలని సూచించారు.

## స్పందించారు.. స్టార్టర్ డబ్బాను సరిచేశారు

స్టార్టర్ డబ్బాను విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన అధికారులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23: మండలంలోని మేజర్‌వాడీ గ్రామం బీసీ కాలనీలో సింగిల్‌ఫేజ్ మోటర్ వద్ద ఉన్న స్టార్టర్ డబ్బాను సోమవారం పంచాయతీ కార్యదర్శి సురేశ్ కుమార్ సరిచేశారు. 'నేలపై స్టార్టర్ డబ్బా ..ఆదమరిస్తే అంతే సంగతి' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికంలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు డబ్బాను సరిచేసి సురక్షిత స్థానంలో ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## మోడల్ స్కూల్లో పార్ట్‌టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో పార్ట్ టైం టీచర్ పోస్టుల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అల్తామస్ జహంగీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ-మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ, కామర్స్, టీజీటీ - ఇంగ్లిష్, సైన్స్, సోషల్‌లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పీజీటీకి సంబంధిత సబ్జెక్ట్‌తో పాటు బీఈడీ, టీజీటీకి డిగ్రీతో పాటు బీఈడీ ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల లోపు పాఠశాలలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డెమో క్లాసుల నిర్వహణ అనంతరం నియామకం చేపడతామని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రీషియన్ (డిప్లొమ ఎలక్ట్రీషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

వెంటనే కావలెను
★వ్యవసాయరంగంలో అనుభవం మరియు డ్రోన్ స్ప్రే యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించి ఒప్పించగలిగే నైపుణ్యం కలిగిన ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ప్రదేశం: సంగారెడ్డి, కామారెడ్డి, సం|| సెల్: 9032527297
NTZ-334401

వెంటనే కావలెను
★Small/Medium తరహా DGCA సర్టిఫికేట్ కలిగి ఉండి 1 సంవత్సర అనుభవం కలిగిన అగ్రిడ్రోన్ పైలట్ కావలెను. విద్యార్హత ఇంటర్మీడియట్ / డిగ్రీ కలిగినవారు సంప్రదించండి సెల్: 9032527297
NTZ-334402

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ప్రజారోగ్యంలో వాటర్‌మన్ బాధ్యతలు కీలకం

## డీఎల్‌పీవో సురేందర్

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే..గ్రామాల్లో వాటర్ మన్ బాధ్యతలు చాలా కీలకమైనవని డీఎల్‌పీవో బి. సురేందర్ అన్నారు. మండలంలోని వాటర్ మెన్‌లకు మాల్తుమ్మెద రైతు వేదికలో సోమవారం నిర్వహించిన వాటర్‌మన్‌ల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాటర్ మెన్ ప్రతిరోజూ గ్రామాల్లో అందుబాటులో ఉండి పైపులు లీకేజీ లేకుండా శుద్ధ జలాలను సరఫరా చేయాలని సూచించారు. వారి కోసం ప్రభుత్వం నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణను వాటర్‌మెన్‌లు సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్‌రెడ్డి సూచించారు. అనంతరం టీవోటీ ట్రైనర్స్ శేఖర్ పంపు సెట్లు, చేతిపంపు రిపేర్, పైప్ లైన్ లీకేజీలు, నీటి నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, ఏఈ వినోద్, మాల్తుమ్మెద పంచాయతీ కార్యదర్శి వెంకట్, భగీరథ సిబ్బంది, 25 గ్రామ పంచాయతీల వాటర్‌మెన్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు

విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యుడు

గాంధారి, సెప్టెంబర్ 22: మండలంలోని చద్మల్ తండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయ అధికారి హరికృష్ణ 168మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ముగ్గురికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలను రిఫర్ చేసినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**పోల్కంపేటలో వైద్య శిబిరం**

లింగంపేట, సెప్టెంబర్23: మండలంలోని పోల్కంపేట గ్రామంలో హైదరాబాద్‌లోని బాచుపల్లికి చెందిన మమత దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దవాఖాన వైద్యులు, పంచాయతీ కార్యదర్శి అశ్వక్ పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన అధికారులు

గాంధారి, సెప్టెంబర్ 22: మండల కేంద్రంతోపాటు బంగర్వాడీ, గుజ్జుల్ శివారులో రైతులు సాగు చేసిన మక్కజొన్న, సోయా, కంది పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు సూర్యప్రకాశ్, విఘ్నేశ్, రాజశేఖర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కోత దశలో ఉన్న సోయా, మక్కజొన్న పంటలు తడవకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని, కుప్పలపై టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. సోయా పంటలో అంతర్‌పంటగా సాగు చేసి కంది పంటపై పచ్చ పురుగు ఆశించినట్లు తెలి పారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

**లింగంపేట మండలంలో..**

లింగంపేట, సెప్టెంబర్23: మండలంలోని పోల్కంపేట, కన్నాపూర్, పోతాయిపల్లి గ్రామాల్లో నేలవాలిన వరి పంటను మండల వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో వరి పంట నేలవాలినట్లు వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మూడు గ్రామాల్లో 29 మంది రైతులకు చెందిన 42 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఏఈవో రాకేశ్, రైతులు లక్ష్మీ నారాయణ, సంగమేశ్వర్, కిష్టయ్య ఉన్నారు.

## అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 23: ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా పరిగణించి, ప్రభుత్వ ఉత్తర్వు 25ను సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటుతో బదిలీ అయిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ప్రతి పాఠశాలకు హెచ్‌ఎంను నియమించి, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని పేర్కొన్నారు.

## బాధితుడికి ఫోన్ అందజేత

లింగంపేట, సెప్టెంబర్ 23: మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన సాయిలు ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా.. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ సాయంతో ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు బాధితుడికి ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం అప్పగించారు. ఎస్సై అరుణ్, పోలీసులు పాల్గొన్నారు.

## నాగన్న బావికి సందర్శకుల తాకిడి

లింగంపేట, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని పురాతన కట్టడం నాగన్న బావిని పునరుద్ధరించి ఇటీవల ప్రారంభించడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, సంఘ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయన వెంట ఆర్యవైశ్య సంఘం సభ్యు లు అతిమాముల రమేశ్ గుప్తా, సుధాకర్, నరహరి, కైలాస లక్ష్మణ్, భాస్కర్, అనిల్, కోపూరి జగన్ ఉన్నారు.

## వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వినతి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 23: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయాలని స్థానికులు కోరారు. ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గండిమాసానిపేట్, కొత్తపల్లి గ్రామాల్లో వీధిదీపాలు సరిగ్గా లేవని, వాటి స్థానంలో కొత్తవి, కొత్తపల్లి గేటు వద్ద హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటుచేయాలని వినతిపత్రంలో కోరారు. రమేశ్, శంకర్, బాలు, భరత్ తదితరులు ఉన్నారు.

## మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో సోమవారం కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. అన్ని వార్డుల్లో మురుగుకాలువలను శుభ్రం చేస్తున్నట్లు చెప్పా రు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్నట్లు తెలిపారు.

## నిజాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, సెప్టెంబర్ 23 : నిజాంసాగర్ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి సోమవారం రెండువేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రధాన కాలువ (విద్యుత్ ఉత్పత్తి కేంద్రం) ద్వారా 1600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1405.00 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1404.98 అడుగుల (17.773 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదని పేర్కొన్నారు.

## వసతి గృహాన్ని సందర్శించిన ఎంపీడీవో

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో ప్రభాకర్ సోమవారం సందర్శించారు. వసతి గృహంలోని విద్యార్థుల బెడ్లు, గదులను పరిశీలించారు. బియ్యం, పప్పులు, ఆయిల్ నాణ్యతను తెలుసుకొని రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహంలో మొత్తం 105 మంది విద్యార్థులకు సోమవారం 95 మంది హాజరైనట్లు వార్డెన్ రాములు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంపీడీవో సూచించారు.

## మురికి కాలువలను శుభ్రం చేయాలి

లింగంపేట, సెప్టెంబర్23: గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేసి మట్టిని తొలగించాలని పంచాయతీ సిబ్బందికి ఎంపీవో మల్హారీ సూచించారు. రహదారులపై గుంతల్లో నిలిచి ఉన్న నీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొయ్యగుండు తండాలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయాలని సూచించారు. ఎంపీవో వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రామారెడ్డి, సెప్టెంబర్ 23: మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం సదాశివనగర్ మండలంలో ఏపీఎం రాజిరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో హాజరై మాట్లాడారు. సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించడం, బ్యాంకు లింకేజీ, మహిళల క్యాంటీన్లు, మీ సేవ కేంద్రాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీసీలు ఆంజనేయులు, సౌజన్య, కృష్ణాంజలి, సౌజన్య, సూపర్‌వైజర్ లత, వీవోలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 23 : జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం పట్టణంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా కంచర్ల బాల కిషన్, ప్రధాన కార్యదర్శి గా ముత్యపు సుదర్శన్, కోశాధికారిగా మోటూరి రాజు, అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా యెంసాని సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉప్పల హరిధర్, అడిషనల్ కోశాధికారిగా నంగునూరి శ్రీనివాస్, పీఆర్వోలుగా ఆది మూలం సతీశ్, కొండ శైలేందర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆర్య వైశ్య కుటుంబాలకు అండగా ఉంటానని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లింగంపేట, సెప్టెంబర్ 23: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో కళా ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలో ఇటీవలకాలంలో యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని పాటలో రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, దేవన్న, మహేందర్, దివ్య, రమేశ్, నాగరాజు, రాము, ప్రశాంత్‌పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ మోడల్ స్కూల్లో సోమవారం జోనల్ స్థాయి క్రీడల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించగా.. కామారెడ్డిలోని ఎస్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు టాటాఏస్ వాహనంలో వచ్చారు. వాహనంలో పరిమితికి మించి 30 మంది విద్యార్థులను ఎక్కించుకోగా..ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

-నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23